


అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 272. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ బుధవారం.16.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# సీజనల్ వ్యాధులు ప్రబలొద్దు

నిజామాబాద్ : అమృత్ తెలంగాణ: వానాకాలంలో దోమల ఉధృతి పెరిగి వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుందని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి (ధనసరి అనసూయ) సీతక్క సూచించారు. ఈ సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. తాగునీరు కలుషితమైతే డయేరియా వ్యాపిస్తుందని, కాబట్టి కలుషితం కాకుండా పైప్‌లైన్‌లను సరి చూసుకోవాలన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లాలో పర్యటిన మంత్రి సీతక్క.. మొదట జిల్లా కేంద్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్(బాలికలు)లో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులతో సమీక్షించారు. హై రిస్క్ ప్రాంతాల్లో డెంగ్యూ ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర మందులు, పాము, కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిం చాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై ప్రజాప్రతినిధులు చేసిన సూచనలపై అధికారులకు పలు సూచనలిచ్చారు. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్న ఐకేపీ మహిళా సంఘాలు నడిపిస్తున్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను రుచి చూసి మెచ్చుకున్నారు. మహిళలను అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని, వారు వృద్ధి చెందినప్పుడే సమాజం ప్రగతిలో ముందుంటుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని సీఎం అమలు చేస్తున్నారని మంత్రి సీతక్క తెలిపారు. సమీక్ష అనంతరం



జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ రుణం రూ.20.56 కోట్ల చెక్కును, కామారెడ్డి నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.5.28 కోట్ల వడ్డీ రాయితీ చెక్కును, లోన్ బీమా కింద రూ.22 లక్షల చెక్కును, ప్రమాద బీమా కింద ముగ్గురు సభ్యుల కుటుంబాలకు రూ.10 లక్షల, రూ.30లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో మహిళా శిశుఅభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ అశీష్ సాంగ్వన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదన్ మోహన్ రావు, తోట లక్ష్మీ కాంతారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మేన్ బాలరాజు, జిల్లా ఎస్పీ రజేష్ చంద్ర, జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు ఎస్పీ చైతన్య, జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బనకచర్లపై చర్చకు ససేమిరా

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రాల మధ్య జలవివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నేడు (బుధవారం) ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బనకచర్లను ఎజెండాగా చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బనకచర్లపై చర్చించాల్సిన అవసరం లేనే లేదనీ, వెంటనే ఎజెండాను సవరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖ రాశారు. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలన్నింటినీ ప్రభుత్వం ఈ లేఖలో ప్రస్తావించింది. ఢిల్లీలో నేడు జరుగనున్న సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఏపీ ప్రభుత్వం సింగిల్ ఎజెండాను కేంద్రానికి పంపించింది. దీనిపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ఈ లేఖ రాసింది. ఇప్పటికే కృష్ణాపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఎజెండా ప్రతిపాదనలను పంపించింది. జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, ఈఏసీ లు బనకచర్లపై తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఇప్పటివరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదనే వాదనను ఈ లేఖలో ప్రస్తావించింది. గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించటం అనుచితమని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి




రాసిన లేఖలో అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అందులో ప్రస్తావించింది. ఇప్పటికే ఏపీ సమర్పించిన ప్రీ–ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఈఏసీ తిరస్కరించిన విషయాన్ని ఇందులో ఉటంకించింది. కేంద్ర జల సంఘం కూడా ప్రీ ఫీజిబులిటీ రిపోర్టును తిరస్కరించాలని విజ్ఞప్తి చేసింది. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని కోరారు. రెండు రాష్ట్రాల సీఎంల సమావేశంలో గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేయాలనీ, తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను అజెండాలో చేర్చాలని విజ్ఞప్తి చేసింది.

# జీనోమ్ వ్యాలీ తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చింది: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: దేశంలోనే వ్యాక్సిన్ ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కోవిడ్ వైరస్ ప్రపంచాన్ని భయపెడుతున్న సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సిన్ లు తయారు చేశామని ఇక్కడి నుంచే ప్రపంచ దేసాలకు వ్యాక్సిన్ లు సరఫరా చేయగలిగామన్నారు. ఇవాళ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా జీనోమ్ వ్యాలీలో ఐకోర్ బయోలాజిక్స్ కొత్త యూనిట్ కు భూమిపూజ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే ఒక గుర్తింపును తీసుకువచ్చాయన్నారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమిని సాధించడమే తమ లక్ష్యం అని అందులో భాగంగా తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ డాక్యుమెంట్ ను ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించబోతున్నామని చెప్పారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా పాలసీలు, అనుమతులు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారినా పరిశ్రమల ఏర్పాటుకు పాలసీలు, రాయితీలు, అనుమతలు విషయంలో విధానపరమైన



నిర్ణయాలను మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్లామే తప్ప ఎక్కడా పరిశ్రమలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు లేవన్నారు. మా ప్రభుత్వం మరింత మెరుగైన పారిశ్రామిక విధానాలను తీసుకువచ్చి పెట్టుబడులను ఆకర్షించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# గోల్డెన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: పంజాబ్ లోని గోల్డెన్ టెంపుల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ రావటం తీవ్ర కలకలం సృష్టించింది. టెంపుల్‌లో బాంబు పెట్టినట్లు అధికారులకు మంగళవారం ఈమెయిల్స్ వచ్చింది. ఈ తరహా ఈ మెయిల్స్ రావడంతో ఇది రెండోసారి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టెంపుల్ పరిసర ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ బెదిరింపు మెయిల్‌పై శిరోమణి గురుద్వార్ ప్రబంధక్ కమిటీ(SGPC) ఆ రాష్ట్ర సీఎంతో పాటు డీజీపికి లేఖ రాసింది. ఆగంతకులను గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయానికి అదనపు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ఇదిలా వుండగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రముఖ స్కూళ్లలో, విమానాశ్రయాల్లో బాంబులు అమర్చినట్లుగా తరచూ బెదిరింపులకు పాల్పడుతూ ఈమెయిల్స్ రావటం ఎక్కువయ్యాయి. ముంబైలోని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (BSE) భవనానికి బాంబు పెట్టినట్లు అధికారులకు మంగళవారం కామ్రేడ్ పినరయి విజయన్ పేరుతో ఈమెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరోవైపు దేశ రాజధానిలోని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్‌లకు, సెయింట్ థామస్ స్కూల్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను ఖాళీ చేయించి.. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గాలింపు చేపట్టాయి. కాగా, ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్( Pinarayi Vijayan) అధికారిక నివాసానికి సైతం బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే.

# 19న కొత్త సీజే ప్రమాణస్వీకారం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ ఏ.కే సింగ్ ఈ నెల 19న ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించనున్నారు. త్రిపుర హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ ఏ.కే.సింగ్ బదిలీపై తెలంగాణకు రానున్నారు. హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా చేస్తున్న జస్టిస్ సుజోరు పాల్ కోల్‌కతా హైకోర్టుకు బదిలీ అయిన నేపథ్యంలో ఆయనకు బుధవారం హైకోర్టు వీడ్కోలు చెప్పనుంది. మొదటి కోర్టు హాల్లో మధ్యాహ్నం 3.45 గంటలకు ఫుల్ కోర్టు వీడ్కోలు చెప్పనుంది. గత చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బదిలీపై బాంబే హైకోర్టుకు బదిలీపై వెళ్లినప్పటి నుంచి జస్టిస్ సుజరు పాల్ యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా చేస్తున్నారు.



చీఫ్ జస్టిస్ బెంచ్‌కి ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల కేసు

రాష్ట్రంలో ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్‌కు చేరింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు అంశంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు సింగిల్ జడ్జిల ఏకసభ్య ధర్మాసనాలు వేరు వేరు నిర్ణయాలు వెలువరించాయి. దీంతో ఈ వ్యాజ్యాలను చీఫ్ జస్టిస్ బెంచ్ ఎదుట ఉంచాలని జస్టిస్ బి.విజరుసేన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు వెలువరించారు. ఒక ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ పిటిషన్‌లో ఫీజు పెంపునకు జస్టిస్ విజరుసేన్‌రెడ్డి ఇటీవల అనుమతిచ్చారు. మరో న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఫీజుల పెంపునకు నిరాకరించారు. తుది తీర్పుకు లోబడి ఫీజుల పెంపు అంశం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో జస్టిస్ విజరుసేన్‌రెడ్డి వద్ద విచారణలో ఉన్న పిటిషన్ సోమవారం విచారణకు రావడంతో పైవిధంగా రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు. ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 2025–26 ఏడాదికి గత బ్లాక్ పీరియడ్ ఫీజులే వర్తిస్తాయన్న ప్రభుత్వ జీవో 26న పలు ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీలు సవాలు చేశాయి.

అక్రమ రవాణా వాహనాలకు విడుదల ఉత్తర్వులు ఇవ్వబోం: హైకోర్టు

రుణంపై కొనుగోలు చేసిన వాహనంలో అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడితే, రుణం ఇచ్చిన సంస్థకు ఆ వాహనాన్ని అప్పగించాలని పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వబోమని హైకోర్టు స్పష్టం చేసింది. రుణం ఇచ్చినంత మాత్రన రుణదాతకు వాహనంపై హక్కులు ఉండవని పేర్కొంది. రుణదాతకు వాహనంపై యాజమాన్య హక్కులు ఉండబోవని వెల్లడించింది. కేవలం తాకట్టు హక్కులే ఉంటాయని తెలిపింది. ఎన్డీపీఎస్ కింద సీజ్ చేసిన వాహనాన్ని ఇప్పించాలని రుణం ఇచ్చిన సంస్థ చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. నల్లబెల్లం తరలిస్తుండగా సీజ్ చేసిన బొలెరో వాహనాన్ని అప్పగించేలా ఎక్సైజ్ శాఖకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ టైగర్ క్యాపిటల్ ప్రయివేట్ లిమిటెడ్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారించారు. వాహనాన్ని తాకట్టు పెట్టుకుని రుణం మంజూరు చేశామనీ, ఎక్సైజ్ పోలీసులు ఆ వాహనాన్ని సీజ్ చేయడం వల్ల అప్పు ఇచ్చిన తమ సంస్థ నష్టపోయిందని పిటిషనర్ న్యాయవాది వాదించారు. మంజూరు చేసిన రుణం చెల్లించనప్పుడు ఆ వాహనాన్ని వేలం వేయగా వచ్చిన డబ్బును రికవరీ చేసుకోవాలనే రుణ ఒప్పందం ఇరు పక్షాల మధ్య ఉంటుందని హైకోర్టు గుర్తు చేసింది. అయితే, నల్లబెల్లం మొదలైన వాటిని అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన వాహనాన్ని విడుదల చేయాలని ఉత్తర్వులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. కేసు తేలే వరకు వాహనాన్ని విడుదలకు ఉత్తర్వులు ఇవ్వబోమని తీర్పు చెప్పింది.

ఎంపీ ఈటలకు ఊరట

హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై నమోదైన కేసులో హైకోర్టు వెసులుబాటు కల్పించింది. ఈటలపై కేసును విచారిస్తున్న నాంపల్లి ప్రజా ప్రతినిధుల కేసుల విచారణ ప్రత్యేక కోర్టులో జరిగే విచారణకు హాజరీ నుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. కింది కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. పోలీసులకు నోటీసులు ఇచ్చి తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 సెప్టెంబర్‌లో హుజూరాబాద్ అసెంబ్లీ సీటుకు జరిగిన ఉప ఎన్నికప్పుడు కోవిడ్ నిబంధనలకు వ్యతిరేకంగా, అనుమతి లేకుండా ర్యాలీ తీశారని ఖాజా బషీరుద్దీన్ అనే ప్రభుత్వాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని ఈటల హైకోర్టులో పిటిషన్ వేశారు. న్యాయవాది వాదిస్తూ, ఆధారాలు లేవనీ, అన్యాయంగా కేసు పెట్టారన్నారు. రోడ్డు కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేందకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలీసులు అనుమతిచ్చారని చెప్పారు. ఈ కేసు నాంపల్లి కోర్టులో ఆగస్టు 14న విచారణకు ఉందన్నారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలనీ, ఈలోగా కింది కోర్టు విచారణకు పిటిషనర్ హాజరు కాకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా, న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

చిరంజీవి అప్లికేషన్‌పై చర్యలు తీసుకోండి : జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో తన ఇంటి పునరుద్ధరణ పనులను క్రమబద్ధీకరించాలని సినిమా హీరో చిరంజీవి పెట్టుకున్న అప్లికేషన్‌ను చట్ట ప్రకారం నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీని హైకోర్టు ఇటీవల ఆదేశించింది. ఇంటి పునరుద్ధరణలో భాగంగా రిటైన్ వాల్ నిర్మాణం చేశామనీ, దీని క్రమబద్ధీకరణకు జూన్ 5న జీహెచ్ఎంసీకి చేసుకున్న దరఖాస్తు అక్కడ పెండింగ్‌లో ఉందనీ, చర్యలు తీసుకునేలా ఆర్డర్ ఇవ్వాలని చిరంజీవి పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజరుసేన్‌రెడ్డి ఇటీవల విచారణ పూర్తి చేసి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేశారు. 2002లో గ్రౌండ్, మరో రెండంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకుని నిర్మించాక పునరుద్ధరణలో భాగంగా ముందస్తు జాగ్రత్త చర్యగా అనుమతులు తీసుకున్నట్టు న్యాయవాది వివరించారు. తనిఖీ చేసి క్రమబద్ధీకరించాలన్న అభ్యర్థనను జీహెచ్ఎంసీ పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై జీహెచ్ఎంసీ న్యాయవాది స్పందిస్తూ, చట్ట ప్రకారం దరఖాస్తుపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిటిషనర్ దరఖాస్తును నాలుగు వారాల్లోగా పరిష్కరించాలని జీహెచ్ఎంసీని ఆదేశించిన న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణ మూసివేసినట్టు ప్రకటించారు.

# గవర్నర్ వద్దకు బీసీ రిజర్వేషన్ల ముసాయిదా




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి న ఆర్డినెన్స్ ముసాయిదా మంగళవారం రాజ్‌భవన్‌కు చేరింది. రిజర్వేషన్ల పెంపునకు వెసులుబాటు కల్పిస్తూ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 క్లాజ్–ఎ సవరించాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ సెక్షన్‌లో స్థానిక సంస్థల్లో 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు అమలవుతాయని ఉండగా..ఇప్పుడు 50 శాతానికి మించకుండా అనే వాక్యాన్ని తొలగిస్తూ ముసాయిదా రూపొందించింది. బీసీ రిజర్వేషన్ల పంచాయితీకి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలకాలనే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. మంత్రి సీతక్క కార్యాలయం నుంచి ముసాయిదా సీఎంవోకు వచ్చిన వెంటనే దాన్ని గవర్నర్ పరిశీలనకు పంపారు. గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే వారం రోజుల్లోగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

# అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపిఎస్

## ట్రాఫిక్ సమస్యల పై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశం

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ రోజు అండర్ ఇన్వెస్టిగేషన్ (UI) కేసులపై జిల్లా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపిఎస్, జిల్లా పోలీసు అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధికారులకు తగు సూచనలు చేశారు.ముఖ్యంగా మిస్సింగ్ కేసులు మరియు %దీచీూా% సెక్షన్ 194 కింద ఉన్న కేసుల పురోగతిపై సమగ్రంగా ఆరా తీసారు. అంతే కాకుండా ప్రజలు ట్రాఫిక్ సమస్యల వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలికారు.ముఖ్యంగా గంజాయి వినియోగం పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. “ప్రతి కేసుపై సమగ్ర విచారణ జరిపి, విచారణను వేగవంతం చేసి కోర్టుల్లో సమర్థవంతంగా సమర్పించాలి” అని స్పష్టం చేశారు. విచారణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పెండింగ్ కేసులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ప్రతి కేసుపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇన్స్పెక్టర్లకు మరియు ఎస్.హెచ్.ఓ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్ష సమావేశం లో జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఐపిఎస్ తో పాటు,భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపిఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన ఐపిఎస్,ఇన్స్పెక్టర్లు మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్. హెచ్.చ్ఓ లు హాజరయ్యారు.




# ఇచ్చోడ బ్లాక్ అధ్యక్షులు మహిముద్ తమ్ముడు మసుధ్ ఖాన్ మరణవార్త తెలుసుకొని అంత్యక్రియలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇచ్చోడ బ్లాక్ అధ్యక్షులు మహిముద్ తమ్ముడు మసుధ్ ఖాన్ మరణవార్త తెలుసుకొని అంత్యక్రియలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బట్టిసావర్గం గ్రామంలో సంతోష్ ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. వారి వెంట ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమరం కోటేష్, ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి, మావల కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, ఎస్సీ సెల్ చైర్మన్ లక్ష్మణ్, ముస్తఫా,మావల వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, రెండ్ల రాజన్న, అక్షయ్, జలై జాకు, మహబూబ్, రషీద్, మాధవ్ పటేల్, సాధిక్ భాయ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు

# డివన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్– అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని డివన్ (D1) పట్టాల జారీపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డి వన్ పట్టాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టే అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. భూ హక్కులపై స్పష్టత కలిగేలా దరఖాస్తుల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో



మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను భూభారతి పోర్టల్‌లో వెంటనే అప్డేట్ చేయాలని, వీలైనంత ఎక్కువ అప్లికేషన్లను త్వరితగతిన డిస్పోజ్ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దారు, సర్వే శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మతల్లి కళ్యాణం... కుటుంబ సమేతంగా హాజరై పూజలు నిర్వహించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బట్టి సవర్గాం గౌడ గీత కర్మిక సంఘం, దుబ్బగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణం కార్యక్రమాన్ని నేడు ఘనంగా నిర్వహించారు గత ఐదురోజులుగా ఎంతో వైభవంగా పూజాది కార్యక్రమాలని నిర్వహిస్తూ నేడు ఎల్లమ్మ తల్లి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సతీ సమేతంగా హాజరై కల్యాణంలో పాల్గొన్నారు. వందలాంది మంది భక్తులు హాజరై అమ్మవారి సేవలో తరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మన చారిత్రక సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతరించిపోతున్న ఎల్లమ్మ ఒగ్గు కథలు, జానపద కళలకు జీవం పోసేలా ఆధ్యాత్మికతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఏంటో ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, భూపతి గౌడ్, పరశురామ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దినేష్ , అక్షయ్, నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, సాయి చైతన్య గౌడ్, నరేష్ గౌడ్, రమేష్ గౌడ్ ఆదిలాబాద్ గౌడ కులస్థులు పాల్గొన్నారు.



# కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో భూ హద్దులను గుర్తించేందుకే రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టినట్లు ఆర్డీఓ రత్న కళ్యాణి తెలిపారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న రెవెన్యూ భూ సర్వే ప్రదేశాన్ని నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, 2015 సంవత్సరంలో అటవీ శాఖ భూములను పునరావాస గ్రామాల ప్రజల ప్రయోజనాల కొరకు డీనోటిఫై చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాల ప్రజలకు చట్ట ప్రకారం భూములు పంచేందుకు అర్హులను గుర్తించామని అన్నారు. ఈ భూముల తుది హద్దులను గుర్తించేందుకే అధికారులు సర్వే చేపట్టారని తెలిపారు. ఈసర్వేపై ప్రజలెవరూ ఆందోళన చెందవద్ద న్నారు. భూసర్వేకు సంబంధించిసందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని తెలిపారు. భూ హద్దుల గుర్తింపు సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

# ఆటో బోల్తా పలువురికి గాయాలు,...

### ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఆటో.. గాయాలపాలైన వ్యవసాయ కూలీలు......, ఆటో డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు...

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి జూలై 15 అమృత్ తెలంగాణ నర్సాపూర్ మండలంలో మంగళవారం బూరుగుపల్లి కే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పని నిమిత్తం ఉదయం అర్లి కి వెళ్లి వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి సాయంత్రం బురుగుపల్లి కి వస్తుండగా మార్గమధ్యలో అర్లి కె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మగ్గిటడి కైలాష్ తన ఆటోను అతివేగంగా నడపడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న బురుగుపల్లి కి చెందిన చిన్నమ్మ, లక్ష్మీ లకు, అర్లి కి చెందిన శనిగారం సుధాకర్, కైలాష్ కు గాయాలు కావడంతో చిన్నమ్మ కు వరుసకు కొడుకు అయినా కళ్యాణ్కర్ వెంకట్రావు, ఆటోడ్రైవర్ పై తగు చర్య గురించి పోలీస్ స్టేషన్ నర్సాపూర్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్ఐ పి గణేష్, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.




ప్రమాదానికి గురైన ఆటో

# ఇంగ్లీష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాం జిల్లా కలెక్టర్ మంగళవారం ఆస్పిరేషనల్ బ్లాక్ నార్నూర్ లో ప్రారంభించడం జరిగింది





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఇంగ్లీష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాం జిల్లా కలెక్టర్ మంగళవారం ఆస్పిరేషనల్ బ్లాక్ నార్నూర్ లో ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి పిల్లలకు ఆంగ్లము చాలా చక్కగా అభ్యసించేలా ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తయారు చేయించి దానికి అనుగుణంగా పిల్లలకు ఆంగ్లము బోధించేలా శిక్షణను ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆంగ్లము బోధించే ఉపాధ్యాయులకు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మొదటగా ఈ పుస్తకం ను విడుదల చేయడం జరిగింది. పుస్తక రచయితలు అజయ్, అన్వర్, సవిత ఆంగ్ల ఉపాధ్యాయులు , రిసోర్స్ పర్సన్స్ గత సంవత్సరం ఏప్రిల్ లో పిల్లలలోని ఆంగ్ల పరిజ్ఞానాన్ని పరీక్షించడానికి పరీక్ష నిర్వహించి పిల్లల స్థాయిని బట్టి ఈ పుస్తక రూపకల్పన చేయడం జరిగింది. ఈ పుస్తకం వారు ఆంగ్లంలో బాగా రాణించడానికి దోహదపడుతుందని ఉన్నత విద్యకై పునాదిగా నిలుస్తుంది అని రచయితలు తెలిపారు.

# గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో వన మహోత్సవం

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : వాతావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు సురక్షిత పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవంలో అందరూ భాగావ్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి నార్నూర్ మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన drdo ఆద్వర్యం లో మెగా వన మహోత్సవం కార్యక్రమం లో 500 మొక్కలు సామూహిక కార్యక్రమం లో , ఏకలవ్య స్కూల్ లో మంగళవారం మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా పచ్చదనాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకర పర్యావరణం అందించాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నార్నూరు మండలం లో విస్తృతంగా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలు మోడల్ స్కూల్, ఏకలవ్య స్కూల్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటాల్సిన ఆవశ్యకత గురించి ఎవరికి వారు గుర్తిస్తూ, విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కల వల్ల పర్యావరణ సమతుల్యం కాపాడడంతో పాటు పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తాయని, జీవ కోటికి స్వచ్ఛమైన ప్రాణ వాయువు లభిస్తుందని గుర్తు చేశారు. ఇది మనకే కాకుండా మన భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మొక్కల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తూ పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగానే కాకుండా, మన అవసరాల రీత్యా కూడా



ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో drdo రవిందర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

# నార్నూర్ మండలం లోని 30 పడకల సామజిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన స్వశోదన్ ట్రస్ట్ ఆద్వర్యంలో మెడికల్ క్యాంప్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి పరిశీలించారు






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : స్వశోదన్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా, ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయబడింది. ఈ క్యాంప్‌లో వివిధ వైద్య విభాగాల నిపుణులు ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. జనరల్ చెకప్, షుగర్, బీపీ, ఈసీజీ, మహిళల ఆరోగ్య పరీక్షలు, పిల్లల చికిత్సలు తదితర సేవలు అందుబాటులో ఉంచారు. ఈ క్యాంప్ ద్వారా సుమారు 350 మంది లబ్ధిదారులు వైద్య పరీక్షలు చేయించుకున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం, జరుగుతుందన్నారు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని, కలెక్టర్ తెలిపారు." ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించిన వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు గ్రామస్థులకు ట్రస్ట్ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, అడిషనల్ dmho మనోహార్, సాధన, డాక్టర్ ఉపాద్యాయ, జనరల్ ఫీజిషియన్ విజయలక్ష్మి, ఇతర వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్లలో వసతి పొందుతున్న పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు.అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ల (CCIs)లో వసతి పొందుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని 44 మంది అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. దీంతో వారు ప్రభుత్వంతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఏకంగా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందే అర్హత కలిగారని తెలిపారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసిన రెండవ జిల్లా నిర్మల్ కావడం గర్వకారణమన్నారు.



# మట్టి సమునా పరీక్ష పత్రములు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## వ్యవసాయ శాఖ , ఇఫ్కో వారి ఆద్వర్యంలో నానో యూరియా ప్లస్ , నానో డిఏపి పై అవగాహన సదస్సు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ మంగళవారం నార్నూర్ రైతు వేదిక లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొని భూసార పరిరక్షణ పథకం , భూసార పరీక్ష విశ్లేషణ పత్రం రైతులకు అందజేశారు ఈ అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి: బి. శ్రీధర్ స్వామి , జిల్లా ఉద్యాన వన అధికారి: సుధాకర్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ శ్రీధర్ చౌహాన్ , సినీయర్ శాస్త్రవేత్త : డాక్టర్. రాజశేఖర్, సోయిల్ సయిన్స్ 'ప్రొఫెసర్ : ప్రవీశ్ కుమార్–, DRDO రవీందర్, mro, mpdo, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతు రైతులందరు మట్టి పరీక్షలు చేయించుకోవాలని,పరిక్షల అనుసారం ఎరువులు వాడలని తెలిపారు.

త్వరలోనే ప్రతీ గ్రామం లో soil heath Awareness క్యాంపెయిన్ చెస్తామని, అట్టి Cord use ప్రాగారికు రైతలలు రావలని కోరారు.

సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ అంటే, రైతుల భూమి యొక్క ఆరోగ్య స్థితిని తెలుసుకోవడానికి, నేల పరీక్షలు నిర్వహించి, ప్రతి రైతుకు వ్యక్తికరించిన మట్టి ఆరోగ్య కార్డులను అందించడం. ఈ కార్డులలో, నేల యొక్క బలాలు, బలహీనతలు, సూక్ష్మపోషకాల లోపాలు , పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయి.

సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ యొక్క ముఖ్య ఉద్దేశాలు:

భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవడం:

నేల పరీక్షల ద్వారా, భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయిలు, pH విలువ, సేంద్రియ పదార్థాల శాతం వంటి ముఖ్యమైన విషయాలను తెలుసుకోవచ్చు.

వ్యక్తిగతీకరించిన ఎరువుల సిఫార్సులు:

నేల ఆరోగ్య కార్డులో పంటలకు అవసరమైన ఎరువుల సిఫార్సులు ఉంటాయి, తద్వారా రైతులు అవసరమైన మొత్తంలో మాత్రమే ఎరువులను ఉపయోగించవచ్చు, ఇది అధిక ఖర్చులను తగ్గిస్తుంది మరియు భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఉత్పాదకతను పెంచడం:

సరైన ఎరువుల వాడకం మరియు భూమి నిర్వహణ ద్వారా పంటల ఉత్పాదకతను పెంచవచ్చు.

పర్యావరణ పరిరక్షణ:

అవసరమైన దానికంటే ఎక్కువ ఎరువులు వాడటం వలన పర్యావరణానికి హాని కలుగుతుంది, సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా ఎరువుల వాడకం తగ్గించడం వలన పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు.

రైతుల ఆదాయాన్ని పెంచడం:

అధిక దిగుబడి మరియు ఖర్చులను తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి సహాయపడుతుంది.

సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ ప్రక్రియ:

1. మట్టి నమూనా సేకరణ:

ప్రభుత్వం గ్రామాలలో మట్టి నమూనాలను సేకరిస్తుంది.

2. నేల పరీక్ష:

సేకరించిన నమూనాలను ప్రయోగశాలలలో పరీక్షించి, నేల యొక్క ఆరోగ్య స్థితిని విశ్లేషిస్తారు.

3. సాయిల్ హెల్త్ కార్డుల జారీ:

విశ్లేషణ ఆధారంగా, ప్రతి రైతుకు వ్యక్తిగతీకరించిన సాయిల్ హెల్త్ కార్డులను జారీ చేస్తారు.

4. కార్డుల పంపిణీ:

జారీ చేసిన కార్డులను సంబంధిత రైతులకు పంపిణీ చేస్తారు.

5. సలహాలు మరియు మార్గదర్శకత్వం:

రైతులు సాయిల్ హెల్త్ కార్డులలో ఇచ్చిన సిఫార్సులను అనుసరించి పంటలను సాగు చేయడానికి అవసరమైన సలహాలు మరియు మార్గదర్శకత్వం అందిస్తారు.

# ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం లో మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : నార్నూర్ మండలం తడిహత్నూర్ గ్రామం లో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా వనమహోత్సవంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటి ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ ను జిల్లా వ్యాప్తంగా 80 ఎకరాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 మంది రైతులు సుమారు 4000 మొక్కలను తమ పంట నాటడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయిల్ పామ్ గురించి మాట్లాడుతూ "ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని , ప్రభుత్వం మొక్కలు, బిందు సేద్య పరికరాల పై రైతులకి రాయితీలను అందిస్తుందని ,తోట నిర్వహణ, అంతర పంటల యాజమాన్యం కొరకు 4200 ఒక ఎకరానికి,నాలుగు సంవత్సరాల పాటు అందిస్తుందని .. కావున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు . నార్నూర్ ని హార్టికల్చర్ హబ్ గా తీర్చిద్దెందుకు ఉద్యాన శాఖ ధృడ సంకల్పం Niti Ayog (Aspirational Block Programme - ABP) కింద నార్నూర్ మండలం అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. ఈ మార్గంలో ఉద్యాన వన శాఖ కీలకపాత్ర పోషిస్తోంది. రైతుల ఆదాయాన్ని పెంచే, పోషకాహార భద్రత కల్పించే దిశగా పలు పథకాల ద్వారా శాఖ ముందుకు సాగుతోంది.గత 3 సంవత్సరములు గా ఉద్యాన శాఖ ద్వారా రాయతీలు రైతులకి అందిచబడ్డాయి. %చీవీజూ–ౡా% పథకం ద్వారా దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టబడింది. ఇందుకోసం 27 మంది రైతులకు సుమారు రూ.14 లక్షల ప్రోత్సాహక రాయితీ మంజూరైంది. MIP పథకం కింద, 124 ఎకరాల్లో బిందు సేద్యం ద్వారా సాగు ప్రోత్సహించబడింది. ఇందుకోసం రైతులు రూ.25 లక్షల రాయితీ పొందారు.

MIDH పథకం కింద, 5 ఎకరాల్లో అరటి సాగు చేపట్టబడుతుంది.



ఉద్యాన / పట్టు పరిశ్రమ శాఖఆద్వర్యంలో స్రీ యూనిక్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ 2025 మహోత్సవం కార్యక్రమం లో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మొక్కలు నాటిన దృశ్యం.

2025–26 సంవత్సరానికి ప్రణాళిక: 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం

10 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు ప్రోత్సాహం

తుంపర సేద్యం , బిందు సేద్యంపై ప్రత్యేక దృష్టి ఈ ప్రణాళికను అమలు పరచే దిశగా ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అలాగే, రైతులకు అవగాహన కల్పించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు DHSO - అదిలాబాద్ ప్రత్యేక చొరవతో నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో ,ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్ర, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి S.సుధాకర్ ,డి ఏ ఓ శ్రీధర్ స్వామి, డి ఆర్ డి ఓ పిడి రవీందర్ రాథోడ్, MRO ఉద్యాన ,వ్యవసాయ అధికారులు ,ప్రీ unique కంపెనీ డీజీఎం మల్లేశ్వర రావు, సిబ్బంది బిందు సేద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# నమ్మక ద్రోహము చేసి మోసం చేసిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు - ఆదిలాబాద్ ఒకటవ పట్టణ సీఐ బి సునీల్ కుమార్.

**బాధితుడికి 90000 నష్టం.**

**అమ్మ ఆరోగ్యం బాలేదని 90000 తీసుకెళ్లి, కారు కొదవ పెట్టి,**


**బాధితుడికి తెలవకుండా కారును ఇతరులకు అమ్మి మోసం.**

**బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు రోహిత్ షిండే పై**

**ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి

ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... బాధితుడు ఆదిలాబాద్ పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ s/o షేక్ మన్నాన్ ఖుర్షాపూర్ నందు నివసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలో వ్యాపారం చేస్తున్న వ్యక్తి, ఈరోజు ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో నిందితుడు రోహిత్ షిండే పై ఫిర్యాదు చేస్తూ, గత కొన్ని రోజుల క్రితం నిందితుడు తన అమ్మకు ఆరోగ్యం బాలేదని బాధితుల వద్ద 90 వేల రూపాయలను తీసుకొని తన యొక్క కారును కొదవ పెట్టి రెండు నెలల్లో తిరిగి ఇస్తాను అని చెప్పి నమ్మబలికి అతనికి నమ్మకద్రోహం చేసి మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. ఒకరోజు బాధితునికి తెలియకుండా ఆదిలాబాద్ మున్సిపాలిటీ వద్ద రోడ్డుపై ఉన్న వాహనాన్ని రోహిత్ షిండే తీసుకెళ్లి ఇతరులకు అమ్మి వేయడం జరిగిందని, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగిన ఎడల తనని బెదిరించి డబ్బులు ఇవ్వను అని బెదిరించడంతో, ఇన్ని రోజులు భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదని, ఈరోజు తనపై పోలీసులకు సంప్రదించి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. నిందితుడిపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితులు కోరాడు. ఈ విషయమై ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో నిందితుడు రోహిత్ షిండే పై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి సునీల్ కుమార్ తెలిపారు.




# మహిళలు, విద్యార్థులు ధైర్యంగా ఉండాలి..

తిమ్మాజిపేట :అమృత్ తెలంగాణ: షీటీం ఆధ్వర్యంలో జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇంచార్జి సిఐ శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, షీటీం పోక్సో చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇంచార్జి సిఐ శంకర్ మాట్లాడుతూ.. మహిళలు ఉన్నత లక్షలను నిర్దేశించు కుంటు భవిష్యత్ పై కోటి ఆశలతో వారు అన్ని రంగాలలోకి అడుగుపెడుతున్నారు.

అదే సమయంలో ఇంటా బయట వారిపై నేరాలు పెరిగిపోతున్నాయి. మహిళ సాధికారతకు కిడ్నపింగ్, రేప్ లు, ఈవ్ టీజింగ్ అనేవి ప్రధాన అవరోధాలు అవుతున్నాయి. అవి స్త్రీల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తిస్తున్నాయి. వీటన్నింటికి జాగ్రత్తగా ధైర్యంగా ఉండాలని జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పనిచేస్తుందని సిఐ శంకర్ వివరించారు. అలాగే సమాజంలో మహిళల శరీర అకృత్యాలు పై అస్లిల అసభ్యకర వాక్యాలు చేస్తూ వికృత ఆనందం పొందే వారు ఎక్కువై పోయారు. మహిళల గౌరవానికి ఉద్దేశ పూర్వకంగా భంగం కలిగించే మాటలేవైనా లైంగిక వేధింపుల కిందకే వస్తాయన్నారు. పని ప్రదేశాలలో బస్సులో, ఆటోలలో ప్రయాణంలో ఉన్న మహిళలపై వేధింపులు జరుగుతున్నాయి.

ఇలా ఎక్కడి కక్కడ పాఠశాలలో కళాశాలలో కీచకులు తిష్ట వేసి ఆడపిల్లని కాల్చుకు తింటున్నారు. మహిళల పై మానసికంగా శారీరకంగా దాడులకు పాల్పడితే మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి పిర్యాదు చేస్తే మీ వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. ఎవరైనా దాడికి పాల్పడిన వారిపై కఠిన చేర్యాలు ఉంటాయన్నారు. ఈ మధ్య సామాజిక మాధ్యమాల ద్వారా విద్యార్థులు ఎక్కువగా తమ సమయాన్ని వృధా చేసుకోవడమే కాకుండా అపరిచిత వ్యక్తుల ద్వారా మోస పోతున్నారు. ప్రత్యేకంగా ప్రధాన కూడలిలో చౌరస్తాలలో మండల జిల్లా కేంద్రాలలో షీ టీం పనిచేస్తుందని బాధితులు 100 లేదా 8712657676 నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని జిల్లా షీటీం ఇంచార్జి విజయ లక్ష్మి వివరించారు. భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీలత భరోసా సేవలు, ఫోక్స చట్టం గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమాదేవి సిసిఎస్ మెంబెర్ శేఖర్ గౌడ్ మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టి షీటీం మెంబెర్స్ వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా స్పూర్తిప్రదాత దుర్గాబాయి

గండీడ్ :అమృత్ తెలంగాణ: మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని చిన్న వార్వాల్ ప్రాథమిక పాఠశాలలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ 116 వ జయంతిని ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణాదేవి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీ అభ్యున్నతికి ఆమె ఎంతగానో కృషి చేశారని, భారతీయ స్వాతంత్ర్య సమరయోధురాలు, న్యాయవాది, సామాజిక కార్యకర్త, రాజకీయ నాయకురాలని అన్నారు. భారతదేశం యొక్క రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘం సభ్యురాలుగా పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పగిడ్యాల బోర్ కృష్ణయ్య,సికిందర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు బాంధవుడు మన బుసిరెడ్డి పాండన్న

పెద్దవూర:అమృత్ తెలంగాణ: బుసిరెడ్డి పాండన్న వివిధ గ్రామాల్లోని వ్యక్తులు మరణించారని తెలుసుకొని వారి కుటుంబాలకు అండగా నిలిచారు. తిరుమలగిర్ మండలం అలవాల గ్రామానికి చెందిన పందిరి కోటయ్య, రంగుడ్ల గ్రామానికి చెందినహోంగార్డు ఆంగోతుకిషన్ నాయక్, గుర్రంపోడు మండలం, చేపూర్ గ్రామానికి చెంది భీమలపల్లి వెంకన్న, గుర్రంపోడు మండలం,చామలేడు బావి గ్రామానికి చెందినదుడుకు బక్కమ్మ, పెద్దవూర మండలం, చలకుర్తి గ్రామానికి చెందిన బోయ రామిరెడ్డి కుటుంబానికి 100 చొప్పున భోజనాలు పంపించడం జరిగింది.అణగారిన వర్గాలకు, నిరుపేద కుటుంబాలకు మన ఆత్మబంధు ఎల్లప్పుడు అండగా ఉంటుందని బుసిరెడ్డి పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్స్ 9581742356,7799585859 కు సంప్రదించవలసినదిగా కోరారు.



# ఎన్జీకేఎల్ జేఏసీ చైర్మన్‌గా సత్యనారాయణ రెడ్డి ఏకగ్రీవం

తిమ్మాజిపేట :అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యాయుల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ గా ఏర్పడి 25 ఉపాధ్యాయ సంఘాల భాగస్వామ్యంతో నూతన జెఎసి కమిటీని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ కన్వీనర్ రూపు జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ జేఏసీ జిల్లా చైర్మన్ గా సత్యనారాయణ రెడ్డి, గౌరవ చైర్మన్ గా జిహెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జనరల్గా డాక్టర్ శ్రీధర్ శర్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతానికి ఉపాధ్యాయ జేఏసీ పనిచేస్తుందని జేఏసీ కమిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, గౌరవ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ కన్వీనర్ విజయ్ కుమార్ లు తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి, పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలను అమలు చేసేందుకు జేఏసీ పనిచేస్తుందని తెలిపారు. అనంతరం డిఇఓ రమేష్ కుమార్ ను డిఇఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ జేఏసీ నూతన కమిటీని డిఇఓ అభినందించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుకు నూతనంగా ఏర్పడిన ఉపాధ్యాయ జేఏసీ ప్రత్యేకంగా కృషి చేయాలని డిఇఓ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తేనే ప్రభుత్వ ఉపాధ్యాయులకు మనుగడ ఉంటుందని డిఈఓ ఈ సందర్భంగా తెలిపారు. డీఈఓ



కార్యాలయం నుండి ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని డిఈవో హామీ ఇచ్చారు. సహకార వాతావరణంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కలిసి పనిచేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యారంగంలో మరింత అభివృద్ధి సాధించవచ్చని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి..



వెల్దండ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం కల్పించాలని పిడిఎస్యు విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళ వారం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మొదటిరోజు వెల్దండ మండలం బొల్లంపల్లి గ్రామపంచాయతీ లో గల ఈదమ్మ బండ తండా , చల్లపల్లి , బొల్లంపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు తెలుసుకోవడానికి సర్వే నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర కమిటీకి నివేదిక అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# ప్రభుత్వ బడుల్లో టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీలు

అచ్చంపేట :అమృత్ తెలంగాణ: మండల పరిధిలోని రంగాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మలమూత్ర విసర్జనకు బాలికలు, బాలురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు 84 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదు మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో త్రాగు నీరు లేదు, మూత్రశాలలు లేవు తరగతుల కొరత తీవ్రంగా ఉంది. తప్పనిసరి పరిస్థితులలో వరండాలో తరగతి గది నిర్వహిస్తున్నారు. పరిసరాలు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. గత ప్రభుత్వంలో మన ఊరు మన బడి కార్యక్రమంలో గత ప్రభుత్వం రూ.60 లక్షలతో అదనపు గదుల కోసం నిధులు మంజూరు చేసింది. కానీ అధికారులను నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల పట్టించుకోక పోవడంతో పనులు అసంపూర్తిగా ఆగిపోయాయని పాఠశాల హెడ్మాస్టర్ శంకర్ తెలిపారు. గ్రామంలో ప్రభుత్వ



పాఠశాలను అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో గ్రామంలో ఇల్లు ఇల్లు తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వివిధ ప్రయివేట్ పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని హెడ్మాస్టర్ తెలిపారు. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మాతృ మరణాలు జరగకుండా చికిత్స అందించాలి: కలెక్టర్

భువనగిరి:అమృత్ తెలంగాణ: జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గర్భిణీలకు తగు సూచనలు, సలహాలు, చికిత్స అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు వైద్య ఆరోగ్యశాఖ వైద్యులను, సిబ్బంది కి ఆదేశించారు. మంగళవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అయన పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భిణీ స్త్రీల ( జనన పూర్వ సంరక్షణ సేవలు) మెరుగుపరచాలని, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం పై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఫాలో అప్ చేయాలన్నారు. హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి వారి వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.జిల్లాలో జరిగిన మాతృ మరణాలలో 52 మాతృ మరణాలపై సమీక్ష జరిపారు.జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు , సిబ్బంది గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరైన సమయంలో చికిత్సలు అందించి ఇకముందు మాతృమరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు సకాలంలో వ్యాక్సినేషన్ కూడా నిర్వహించాలని కోరారు. ఏఎన్ఎం, ఆశా గృహ సందర్శన చేసి గర్భిణీ స్త్రీల నమోదు సకాలంలో చేసి వారికి వ్యాక్సినేషన్,




మరియు మాత్రలు, చికిత్సలు అందించాలని ఆదేశించారు. హై రిస్క్ కేసులను సకాలంలో గుర్తించి గర్భిణి సమయంలో , కాన్పు సమయంలో ఇబ్బందికలగకుండా తల్లి బిడ్డ క్షేమంగా ఉండేటట్టు వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆసుపత్రికి పంపాలని సూచించారు. యూపీహెచ్ సి లో గల సిబ్బంది మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు గర్భవతుల ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు సూచనలు, సలహాలు ,చికిత్స అందించాలని కోరారు. ప్రభుత్వఆసుపత్రులపైనమ్మకంకలిగేలాగర్భిణీ స్త్రీలపై ప్రేమ,ఆప్యాయతతో మాట్లాడాలన్నారు.సాధ్యమైనంతవరకు నార్మల్ డెలివరీ అయ్యేలాచూడాలన్నారు. హై రిస్క్ కేసులను సకాలంలో గుర్తించి సరైన సమయంలో చికిత్స అందించి తల్లి బిడ్డ క్షేమంగాఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి అన్నారు.

## ఆ హీరో అంటే అమ్మడికి అంత క్రష్.. ఓపెన్ గా చెప్పేసింది



ఒకే ఒక్క పాట.. అందులోని ఒకే ఒక్క ఎక్స్ ప్రెషన్ తో ఇంటర్నెట్ ను షేక్ చేయటమే కాదు.. అశేష భారతానికి సుపరిచితం కావటమే కాదు.. దాదాపు ప్రతిఒక్క వాట్సాప్ గ్రూపుల్లో షేర్ అయిన సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. గతంలో మీ అభిమాన నటుడు ఎవరు? అన్న ప్రశ్నను వేస్తే.. సమాధానం చెప్పేందుకు చాలా ఇబ్బంది పడేవారు. ఆచితూచి అన్నట్లు సమాధానం చెప్పేవారు. ఇప్పుడు సీన్ మారింది. మీకు ఇష్టమైన హీరో ఎవరంటే.. తడుముకోకుండా సమాధానం చెప్పేయటమే కాదు.. కొందరు హీరోయిన్లు అయితే ఏకంగా తాము ఇష్టపడే హీరోల పేరు.. క్రష్ ఉన్న హీరో పేరును కూడా చెప్పేస్తున్నారు. తాజాగా అలాంటి పనే చేశారు సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ అనే మూవీతో పాపులర్ అయిన ఆమె.. మలయాళం.. తెలుగుతో పాటు హిందీ మూవీలు కూడా చేశారు. తాజాగా ఆమె చూపు కోలీవుడ్ మీదకు మళ్లినట్లుగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో హీరో ధనుష్ కు సంబంధించిన విషయాల్ని తన ఇన్ స్టా లో షేర్ చేస్తూ.. అందరి అటెన్షన్ ను డ్రా చేస్తోంది. తాజాగా ఒక విలేకరి అడిని ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వటమే కాదు.. తన ఇన్ స్టాలో ధనుష్ కు సంబంధించిన పోస్టులు ఎందుకు పెడుతున్న విషయానికి జస్టిఫికేషన్ ఇచ్చేలా బదులు ఇవ్వటం గమనార్హం.

## ఆ భయంతోనే ఇంట్లో వెంటనే చెప్పలేదు

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది.కెరీర్ ఆరంభంలో షార్ట్ ఫిల్మ్ లో నటించిన ప్రియాంక జవాల్కర్ తర్వాత సినీ ఇండస్ట్రీలోకి వచ్చి మెల్లిగా హీరోయిన్ గా మారింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ట్యాక్సీ వాలా సినిమాతో ప్రియాంక హీరోయిన్ గా మారిన విషయం తెలిసిందే.ఆ తర్వాత కిరణ్ అబ్బవరంహీరోగా వచ్చిన కల్యాణ మండపంతో మరో హిట్ ను అందుకున్న ప్రియాంక రీసెంట్ గానే మ్యాడ్ స్క్వేర్ సినిమాలో ఓ కీలక పాత్ర చేసింది. మ్యాడ్ స్క్వేర్ సక్సెస్ అయినందుకు తన ఆనందాన్ని షేర్ చేసుకుంటూ మీడియాతో మాట్లాడిన ప్రియాంక తను చేసిన మొదటి సినిమా గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. చదువు అయిపోయిన తర్వాత నుంచే ప్రియాంక షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఏదైనా సినిమా ఛాన్స్ వస్తుందేమోనని ట్రై చేస్తూనే ఉంది. ఇంట్లో వాళ్లకు ఆ విషయం తెలిసి కూడా తనకు నచ్చింది చేసుకుంటుందిలే అని ఏమనకుండా వదిలేశారు.



## బాప్ రే.. బీచ్ ని మరిగించిన నోరా వైరస్

డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి గురించి పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాలో ఇతర నాయికలతో పోలిస్తే చాలా స్పీడ్ గా ఉంటుంది. తరచుగా తన అందమైన ఫోటోలు వీడియోలతో నెటిజనులకు కావాల్సిన ట్రీటిస్తూనే ఉంది. ఇటీవల నోరా తన ఇన్ స్టాగ్రామ్ హ్యాండిల్ లో తన డ్యాన్స్ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో నోరా ఒక బీచ్ లో తన గై గ్యాంగ్ తో కలిసి హీటెక్కించే బీట్ కి డ్యాన్స్ చేస్తూ కనిపించింది. మనోహరి ఎప్పటిలాగే అందంగా కనిపించింది. నోరా ఫతేహి చిస్ బ్రౌన్ లేటెస్ట్ సాంగ్ 'కాల్ మి ఎవ్రీ డే ఇన్ మారిషస్..' కి డ్యాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేసింది. ఆమె స్నేహితులు రజిత్ దేవ్ - మేకప్ ఆర్టిస్ట్ మార్స్ పెడ్రోజో కూడా చేరారు. నోరా బీచ్ లోని ట్రాక్ కోసం తన సాధారణ శైలిలో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తుంది. ఆకట్టుకునే ఈ డ్యాన్స్ వీడియోకి 'వైబింగ్ ప్రతిరోజూ కాల్ చేయండి'అని క్యాప్షన్ ని ఇచ్చింది.. వీడియోలో నోరా పింక్ బీచ్ బ్రా– డెనిమ్ మినీ షార్ట్సను ధరించి కనిపించింది. తన పోస్ట్ ను సోషల్ మీడియాలో షేర్ చేయగానే చాలా మంది గుండె –ఫైర్ ఎమోజీలను షేర్ చేసారు. అందాల నోరా డ్యాన్స్ స్కిల్స్ గురించి పరిచయం అవసరం లేదు. ఆమె ఎక్కడైనా డ్రమ్స్ రోల్ విన్నా.. పాప్ బీట్ విన్నా వెంటనే నాగిని నృత్యంతో వెస్ట్రన్ స్టైల్ డ్యాన్స్ లతో కట్టి పడేస్తుంది. బీచ్ లో నోరా ఫతేహి డ్యాన్సులకు వీక్షకులు కూడా జాయినయ్యేంత స్ఫూర్తిని నింపిందని చెప్పాలి. ఇంతకీ ఇది ఏ బీచ్ అంటే? థాయ్లాండ్ లోని ఉష్ణమండల బీచ్ ఇది నోరా ఎల్లప్పుడూ బీచ్ గాలిలో డ్యాన్స్ చేయడాన్ని చాలా సీరియస్గా తీసుకుంటుందని మనకు తెలుసు. గత సంవత్సరం నోరా ఫతేహి 'వన్ డ్యాన్స్' ఛాలెంజ్ని స్వీకరించినప్పుడు



ఇంటర్నెట్ లో యువతరం తమవైన డ్యాన్స్ కదలికలతో విపరీతంగా స్పందించారు. కానీ ఇప్పుడు అందరూ పింక్ బ్యాండో బికినీ– షార్ట్ లలో నోరాతో పోటీపడాలనుకోవడం ఖాయం. డెనిమ్ షార్ట్– పింక్ బ్యాండ్యూ బికినీ సెట్ లో నోరా చాలా స్పెషల్ గా ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బ్యూటీ ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా .. ఐటమ్ భామగా భారీగానే ఆర్జిస్తోంది. విదేశీ ఈవెంట్లు... ఫ్యాషన్ ఈవెంట్లు ...ఇతర ప్రకటనల ద్వారాను ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంది.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## ఓపెన్ బాత్ రూంలోని బాత్ టబ్ లో ముద్దుగుమ్మ అందాల విన్యాసాలు



విశ్వక్సేన్ హీరోగా నటించిన అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాలో హీరోయిన్ గా నటించిన రుక్సార్ ధిల్లాన్ మంచి గుర్తింపును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా పాపులారిటీని సొంతం చేసుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆఫర్స్ దక్కించుకోలేక పోతుంది. దాంతో సోషల్ మీడియాలో సాధ్యమైనంత వరకు ఎక్కువ శాతం మంది దృష్టిని ఆకర్షించాలి అనుకుందో ఏమో కానీ ఇలా అందాల ఆరబోతకు సిద్ధమయింది. గత కొన్నాళ్లుగా ఈ అమ్మడు ఇంస్టాగ్రామ్ లో రెగ్యులర్ గా ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ని ఇస్తుంది. తాజాగా ఓపెన్ బాత్రూంలో బాత్ టబ్ లో పడుకొని బికినీతో ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. బాత్ టబ్ లో ఉండి ఫోటోలకు ఫోజు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com